సాక్షి చిత్తూరు

బుధవారం । 15 । ఫిబ్రవరి । 2023



చిత్తూరు బులియన్

బంగారం:

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,150
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,000
రిటైల్ వెండి గ్రాము	రూ.72

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	34	16
తిరుపతి	33	17
తిరుమల	30	13
గూడూరు	34	19
నగరి	34	18



హోరాహోరీగా 'ఎస్పీఎల్'

సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్పీఎల్) రీజనల్ స్థాయి క్రికెట్ పోటీలు తొలిరోజు హోరాహోరీగా సాగాయి. అనంతపురం, వైఎస్సార్, తిరుపతి, కర్నూలు, నంద్యాల జట్లు రీజనల్ స్థాయి పోటీలకు అర్హత సాధించాయి. ...8లో

న్యూస్‌రీల్

మొగిలి బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ



విద్యుత్ దీపకాంతుల్లో మొగిలి శివాలయం

బంగారుపాళెం: దక్షిణకాశిగా విరాజిల్లుతున్న మొగిలి స్వయంభు శ్రీమొగిలీశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ చేయనున్నారు. ఈ నెల 15వ నుంచి 25 తేదీ వరకు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. వివిధ వాహనాల్లో స్వామి, అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయ పరిసరాలను శుభ్రం చేయించి, ఆలయానికి వెల్ల వేశారు. భక్తుల కోసం చలువ పందిళ్లను, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి మునిరాజ, వంశపారంపర్య ధర్మకర్త విజయకుమార్ తెలిపారు.

19న జాతీయ తెలుగు రచయితల సదస్సు

పలమనేరు: జాతీయ తెలుగు రచయితల సదస్సును స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఈనెల 19న పలమనేరులోని కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు సమితి నిర్వాహకులు తులసీనాథం నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'తెలుగు భాష రక్షణకు మీరేమి చేయగలరు' అనే అంశంపై ఇక్కడ చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి జాతీయస్థాయిలో వందమంది దాకా రచయితలు, కవులు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తెలుగు భాషాభిమానులు, సాహితీవేత్తలు పాల్గొని జయప్రదం చేయాలని అందులో కోరారు.

ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గం



గీత



చందామర్రై

నగరి : ఆశా వర్కర్ల చిత్తూరు జిల్లా నాలుగో మహాసభల సందర్భంగా రెండోరోజు మంగళవారం ఆశా వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడిగా కోదండయ్య, అధ్యక్షురాలిగా గీత, ప్రధాన కార్యదర్శిగా చందామర్రై, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుజాత, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అరుణ, కోశాధికారిగా మాధవి, ఉపాధ్యక్షులుగా, సహాయ కార్యదర్శులుగా పలువురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



టీడీపీ డీలా..!

- గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ హవా..
- వార్ వన్‌సైడ్ అనేలా ఫలితాలు
- టీడీపీని వెంటాడుతున్న ఓటమి భయం
- కనీసం ఆ పార్టీ తరఫున టీచర్ ఎమ్మెల్సీగా పోటీకి అభ్యర్థి కరువు
- ప్రచారంలో నిమగ్నమైన వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులు

గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రజాసంక్షేమ పాలన అందిస్తోంది. కుల, మతాలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందుతోంది. నవరత్నాల పథకాల ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతుండడంతో ప్రజలు కూడా వైఎస్సార్‌సీపీ బ్రహ్మరథం పడుతున్నారు. అందుకు గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలే సాక్ష్యం. వార్ వన్‌సైడ్ అన్నట్లుగా ఫలితాలు వచ్చాయి. తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు గెలుపు ఖాయమనే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.

సాక్షి, చిత్తూరు : రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలన అందిస్తుండడంతో గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీ ఘన విజయం సాధించిన విషయం విదితమే. ఆ ఎన్నికల ఫలితాలతో ప్రతిపక్ష టీడీపీ డీలా పడిపోయింది. మళ్లీ ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో ఆ పార్టీ మద్దతుతో పోటీ చేయడానికి కనీసం అభ్యర్థులు కూడా ముందుకు రావడం లేదు. దీంతో టీడీపీని ఓటమి భయం వెంటాడుతోంది. తూర్పు రాయలసీమ ఉమ్మడి ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థుల స్థానాల ఎన్నికలకు ఇటీవల ఎన్నికల సంఘం షెడ్యూల్ జారీచేసిన విషయం విదితమే. ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు డైరెక్టుగా పోటీ చేయకపోయినా ఆయా పార్టీలు బలపరచిన అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థులు గెలుపొందడం ఖాయమన్న సంకేతాలు బలంగా వినిస్తుండడంతో టీడీపీ నేతలకు దిక్కుతోచడం లేదు. దీనికితోడు ఆ పార్టీ తరఫున టీచర్ ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడం గమనార్హం. అయితే గ్రాడ్యుయేట్ అభ్యర్థిగా ప్రకాశం జిల్లా కందుకూరుకు చెందిన కంచర్ల శ్రీకాంత్ బరిలో నిలిచారు. మరోవైపు ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నెల్లూరుకు చెందిన బాబురెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకాశం జిల్లాకు చెందిన మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి బరిలో ఉన్నారు. వీరు స్వయంగా కాకుండా యూటీఎఫ్, ఎస్టీయూ సంఘ నాయకులతో కలిసి క్షేత్రస్థాయి ప్రచారం చేయించారనే మాటలు వినిపిస్తున్నాయి.


వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు వీరే..

ఉమ్మడి ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి బరిలో నిలుస్తున్నారు. అలాగే టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. గత ఐదు నెలలుగా వీరు క్షేత్రస్థాయిలో గ్రాడ్యుయేట్, టీచర్‌ల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. అయితే వీరు ఇద్దరూ కూడా నెల్లూరు జిల్లా వాసులే. పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా, పేర్నాటి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రాచుర్యం పొందారు. పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి విద్యావేత్త, విద్యాసంస్థల చైర్మన్‌గా పేరు పొందారు. వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థులు ఉమ్మడి ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు జిల్లాల్లో వీరు క్షేత్రస్థాయి పర్యటనలు చేసి ప్రచారం చేస్తున్నారు.

మార్చి 13న పోలింగ్..

తూర్పు రాయలసీమ ఉమ్మడి ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థుల స్థానాల ఎన్నికకు ఇటీవల ఎన్నికల సంఘం షెడ్యూల్ జారీచేసింది. ఆ షెడ్యూల్ ప్రకారం మార్చి 13న ఎమ్మెల్సీ ఎన్నికకు పోలింగ్ జరగనుంది. అయితే ఈ ఎన్నికలకు నెల రోజుల సమయం ఉండడంతో ఎన్నికల కోలాహలం మొదలైంది. మరోవైపు ప్రచారానికి సమయం తక్కువ ఉండడంతో అభ్యర్థులు క్షేత్రస్థాయిలో ముమ్మరం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలన అందిస్తుండడంతో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. అందుకు గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలే సాక్ష్యం. వార్ వన్‌సైడ్ అన్నట్లుగా ఫలితాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలోనే మరోమారు ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు గెలుపు ఖాయమనే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. ఇదే తరుణంలో అభ్యర్థులు పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి ఓటర్ల వద్దకు నేరుగా వెళ్లి కలుసుకుని వారి సమస్యలు విని పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇస్తున్నారు.

బాధ్యతగా పట్టభద్రుల వైపు ఉంటా...



క్షేత్రస్థాయిలో ఇప్పటికే భారీ గా ప్రచారం చేశాము. ప్రైవే ట్ టీచర్లకు, అధ్యాపకులకు పీఎఫ్ సౌకర్యం, హెల్త్‌కార్డులతో పాటు ఎమర్జెన్సీ ఫండ్ ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తా. క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రైవేట్ టీచర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నాను. రానున్న రోజుల్లో మరింత బాధ్యతగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. పట్టభద్రుల వైపు ఉంటా. **– పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి**

ముమ్మరంగా చేస్తున్నాం



ప్రచారం ముమ్మరంగా చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు ఉమ్మడి జిల్లాల్లో పర్యటిస్తున్నాం. ఎన్నికల నిబంధనలను అనుసరి స్తూ ప్రచారం చేస్తున్నాం. వి ద్యాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందజేసేందుకు కృషి చేస్తా. అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో టీచర్‌లను కలుసుకున్నాం. ప్రైవేట్ విద్యాసంస్థల్లో టీచర్లకు ఓటు హక్కుపై అవగాహన కల్పించడం జరిగింది. **– పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి**

రూ.19 లక్షల నిధులు స్వాహా



సంఘ సభ్యుల సమక్షంలో లెక్కలు సరి చూస్తున్న అధికారులు

- సంఘమిత్ర ప్రేమ, హరినాథ్ దంపతుల చేతివాటం
- అధికారుల తనిఖీల్లో బయటపడిన మోసం

గుడుపల్లె: పాదుపు సంఘాలకు సంఘమిత్రగా పని చేస్తున్న ప్రేమ, ఆమె భర్త హరినాథ్‌తో కలసి సంఘాల ద్వారా వసూలైన రూ.19,36,366 నగదును కాజేశారని మంగళవారం ఇందిరక్రాంతి పథకం అధికారులు తేల్చారు. మండలంలోని పాగురుపల్లెలో ఇందిర క్రాంతి పథకంలోని 15 సంఘాల లెక్కలు చూసేందుకు అదే గ్రామానికి చెందిన ప్రేమ సంఘమిత్రగా వ్యవహరిస్తున్నారు. ఆమె భర్త హరినాథ్ సంఘాలకు రుణాలు ఇచ్చే యూనియన్ బ్యాంకుకు బీసీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని అన్ని సంఘాలకు ఇటీవల కాలంలో రుణాలు తీసి ఇచ్చారు. బ్యాంకు రుణాల రికవరీలో భాగంగా సభ్యుల దగ్గర వసూలు చేసి డబ్బులను బ్యాంకులో కట్టకుండా సంఘమిత్ర స్వాహా చేశారు. దీంతో బ్యాంకులో తీసుకున్న డబ్బులు జమ కాకపోవడంతో బ్యాంకు అధికారులు సంఘాల సభ్యులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో అసలు విషయం బయట పడింది. ఇందిర క్రాంతి పథకం అధికారులు, బ్యాంకు అధికారులు పాగురుపల్లెలో 15 సంఘాల సభ్యులను సమావేశపరిచి సంఘమిత్ర ప్రేమ, ఆమె భర్త హరినాథ్ ఆధ్వర్యంలో బ్యాంకులో తీసుకున్న రుణాలు, సభ్యులు కట్టిన నగదు వివరాలను లెక్కకట్టి రూ.19,36,366 స్వాహా అయినట్లు తేల్చారు. వచ్చే నెలలోపు స్వాహా అయిన నిధులను సంఘమిత్ర బ్యాంకుకు చెల్లిస్తామని చెప్పారని ఏపీఎం శ్రీనివాసులు తెలిపారు. ఇందిరక్రాంతి ఏసీ చంద్రశేఖర్, బ్యాంకు మేనేజర్ పాండురంగన్ సీసీలు పాల్గొన్నారు.

ఏనుగుల బీభత్సం

- పశువుల షెడ్డు, మామిడి చెట్లు ధ్వంసం
- టమాట, వరి పంటలపై దాడి



ఏనుగులు ధ్వంసం చేసిన పశువుల షెడ్డు

పెద్దపంజాణి: మండలంలో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. పెద్దకాప్పల్లి పంచాయతీ అటవీప్రాంత సరిహద్దు గ్రామాలైన పెద్దకాప్పల్లి, ముదిరెడ్డిపల్లి, పెనుగొలకల, తిప్పిరెడ్డిపల్లి, ఆకులవారిపల్లి, కొత్తబూరగపల్లి, జిట్టంవారిపల్లి రైతుల పొలాల్లోకి ఏనుగులు పదేపదే చొరబడుతూ తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. తాజాగా సోమవారం రాత్రి కీలపట్ల ఫారెస్టు బీటు నుంచి వచ్చిన మూడు ఏనుగులు జిట్టంవారిపల్లికి చెందిన సుబ్రమణ్యం రెడ్డి పశువుల షెడ్డును ధ్వంసం చేశాయి. అందులోని పశువుల దాణాను పూర్తిగా తినేశాయి. అదే గ్రామానికి చెందిన నరసింహారెడ్డి, ఇతర రైతుల టమాట, వరి పంటలను తొక్కి నష్టం చేకూర్చాయి. మామిడి చెట్లను విరిచేశాయి. గజదాడులతో సుమారు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోయారు. సమాచారం అందుకున్న రాయలపేట, చారాల బీట్ ఆఫీసర్లు రవికుమార్, దొరస్వామి ట్రాకర్ల సాయంతో ఏనుగులను కీలపట్ల అటవీ ప్రాంతంలోకి మళ్లించారు. పంటలు నష్టపోయిన వారి వివరాలను ఉన్నతాధికారులకు పంపించి నష్టపరిహారం మంజూరుకు చర్యలు చేపడతామని తెలిపారు.

వళ్లిగట్లలో కేంద్రబృందం పర్యటన



వాటర్‌షెడ్ పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

సోమల: జలశక్తి అభియాన్ పథకంలో భాగంగా భూగర్భ జలాలను పెంచడంలో ఉత్తమ ఫలితాలను కనబర్చినందుకు జాతీయ స్థాయి అవార్డుకు మండలంలోని వళ్లిగట్ల పంచాయతీని సిఫార్సు చేస్తున్నట్లు కేంద్రబృందం సభ్యులు లక్ష్మీనారాయణ, సుమన్ తెలిపారు. మంగళవారం వారు పంచాయతీలో గతంలో చేసిన వాటర్‌షెడ్ పనులను తనిఖీ చేశారు. ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ ప్రభాకర, ఎంపీడీఓ నాగరాజ, సర్పంచ్ సౌజన్య, ఎంపీటీసీ సభ్యురాలు కల్యాణి పాల్గొన్నారు.





సేంద్రియ పద్ధతిలో అరెకరం పొలంలో సాగైన 21 పంటలు

పది ఇంచుల పొడవు పెరిగిన ఎర్రబెండను చూపుతున్న రైతు చంద్రశేఖర్

సేంద్రియ చంద్రం!

పట్టుదల ఉంటే సాధించలేదని లేదు అని నిరూపించారు రైతు చంద్రశేఖర్. వ్యవసాయంపై మక్కువతో అద్భుతాలు సృష్టిస్తున్నారు. రసాయనిక మందులతో సారం కోల్పోయిన భూమికి సేంద్రియ ఎరువులను వినియోగించి పునరుజ్జీవం పోశారు. అరెకరా పొలంలోనే ఆధునిక విధానాలు పాటిస్తూ 21 రకాలు పంటలు సాగు చేస్తూ అబ్బురపరుస్తున్నారు. క్రిమిసంహారకాలను వాడకుండా, కొత్త వంగడాలతో.. వినూత్నంగా కూరగాయలను పండిస్తూ అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నారు. ప్రకృతి సేద్యంపై తోటి రైతులకు సైతం అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

- ఆధునిక సేద్యంతో ఆదర్శంగా నిలుస్తున్న రైతు చంద్రశేఖర్
- అరెకరాలో 21 రకాల పంటలు
- ప్రకృతి వ్యవసాయంతో అద్భుతాలు

నగరి : మండలంలోని కృష్ణరామాపురం గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌కు మూడున్నర ఎకరాల పొలం ఉంది. అందులో దాదాపు పదేళ్ల నుంచి సేంద్రియ విధానంలోనే సాగు చేసుకుంటున్నారు. ఏళ్ల తరబడి సహజ సిద్ధమైన ఎరువులనే వాడుతున్నారు. దిబ్బెరువు, ఘనజీవామృతం, ద్రవజీవామృతం, వేప కషాయం, ఆకుల కషాయం తదితరాలను వినియోగిస్తున్నారు. పంట కాలం ముగిసిన తర్వాత మొక్కలను భూమిలో మల్చింగ్ చేసేవారు. తొలి నాళ్లలో తోటి రైతులు చంద్రశేఖర్ సాగు చేస్తున్న విధానాన్ని హేళన చేసేవారు. రసాయన ఎరువులను తెచ్చుకోకుండా ఎందుకు ఇబ్బందిపడతావని నిరుత్సాహ పరిచేవారు. సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవడం అంటే చాలా కష్టమనేవాళ్లు. అయితే ఇవేమీ పట్టించుకోకుండా చంద్రశేఖర్ మాత్రం తాను అనుకున్న విధానంలోనే ముందుకెళ్లారు. పంటలకు నీరు పారించే కాలువలకు అనుసంధానంగా జీవామృతం సిద్ధం చేసే తొట్టిను కట్టారు. అందులో నుంచి వచ్చే జీవామృతాన్ని పంటలకు అందించారు. దీంతో భూమి అత్యంత సారవంతమై పొలంలో ఎక్కడ తవ్వినా వానపాములు బయటపడే పరిస్థితి వచ్చింది. ఈ క్రమంలో చంద్రశేఖర్ పొలంలో ఏ పంట వేసినా నాణ్యమైన దిగుబడి వస్తోంది.

21 రకాలు కూరగాయల సాగు

కుటుంబం కోసం మరో అరెకరాలో కూరగాయల సాగు చేపట్టారు. అదీ ఆషామాషీగా కాదు మొత్తం 21 రకాలు పంటలను పండిస్తున్నారు. ఎర్రబెండ, మునగ, గోరు చిక్కుడు, వంగ, ఉల్లి, ముల్లంగి, బంతి, కొత్తిమీర, కాకర, బీర, కంది, అరటి, మొక్కజొన్న, జొన్న, ఆకు కూరలు, అలసందలు, పెసర, టమాట, జామ, పుదీనా, మిరప పంటలను సాగు చేస్తున్నారు. ఇందుకోసం ముందుగా 3 అడుగుల బెడ్లు, ఒకటిన్నర అడుగు పాదు చొప్పున 45 బెడ్లు సిద్ధం చేసుకున్నారు. అందులో అడుగుకు ఒక మొక్క చొప్పున టమాట, బెండ, గోరు చిక్కుడు, వంద, కాకర, అలసందలు, పెసర, కంది ఇలా ఒక్కోటి నాటుకున్నారు. ఒకటిన్నర అడుగు పాదులో అడుగుకు ఒక మొక్క చొప్పున ముల్లంగి, ఉల్లి నాటారు. వీటి మధ్యలో ఆకు కూరలు, మిరప, మునగ, అరటి, జామ, పూల మొక్కలు, వాము, సోంపు పంటల వేశారు. కంచె పంటలుగా జొన్న, బీర, జొన్న, మొక్కజొన్న నాటారు. నాలుగు నెలల సాగులో సుమారు 100 కేజీల ఉల్లి దిగుబడి వచ్చింది. కేజీ రూ.35 చొప్పున మార్కెట్‌లో విక్రయించారు. 3 నెలల సాగులో 200 కేజీల టమాట రాగా కేజీ రూ.20 చొప్పున అమ్మారు. రెండు నెలల సాగులో 100 కేజీల వంకాయలు రాగా, కేజీ రూ. 60 లెక్కన మార్కెట్‌కు తరలించారు. మిగిలిన పంటలు పది కేజీల మేర దిగుబడి వస్తుండగా, ఇంటికి వాడుకుని కొంత ఇరుగు పొరుగు వారికి విక్రయిస్తున్నారు. పంటను మార్చి మార్చి నాటడం వల్ల తెగులు, పురుగుల సమస్య ఉండదని, మిత్ర పురుగులు పెరుగుతాయని రైతు తెలియజేస్తున్నారు. పంట కాలం ముగిస్తే దాన్ని అక్కడే మల్చింగ్ చేసి కొత్త మొక్కలను వాటి స్థానంలో నాటుతున్నామని, ఇలా చేయడం వల్ల 365 రోజులు పంట సాగులో ఉండి ఆదాయం అందుతుంటుందన్నారు.

ఆకట్టుకుంటున్న ఎర్రబెండ

ముఖ్యంగా కొత్త వంగడమైన ఎర్రబెండను ఈ ప్రాంతానికి పరిచయం చేశారు. ఇది చుట్టుపక్కల రైతులను విశేషంగా ఆకర్షిస్తోంది. 6 నుంచి 7 అడుగుల పొడవు పెరిగే ఈ బెండ చెట్లకు 6 నుంచి 11 ఇంచీల సైజులో కాయలు కాస్తున్నాయి. ఐదారు కాయలే అరకేజీ వరకు బరువు తూగుతున్నాయి. ఏసీలు, ఫ్రిజ్‌లు అవసరం లేకుండా ఎక్కువ రోజులు నిల్వ ఉంటున్నాయి. ఎర్రబెండలోనే రోజు మార్చి రోజు 10 కేజీల వరకు కేజీ రూ.40 చొప్పున అమ్ముతున్నారు. ఆర్గానిక్ పంట కావడంతో ప్రజలు కూడా ముందస్తుగా చెప్పి మరీ పొలం వద్దే కాయగూరలు కొనుగోలు చేసుకుంటున్నారు.

కళకళలాడుతున్న చెరుకు

చంద్రశేఖర్ ముందుగా మూడు ఎకరాల్లో చెరుకు సాగు చేపట్టారు. చుట్టుపక్కల రైతుల పొలంలో రెండు, మూడు మార్లాములకే చెరుకు తొలగిస్తుంటే, ఆయన భూమిలో మాత్రం ప్రస్తుతం పదో విడత కూడా ఏపుగా పంట పెరుగుతుండడం విశేషం.దీంతో అప్పటివరకు అవహేళన చేసిన వారు సైతం ముక్కున వేలేసుకుంటున్నారు. తాము కూడా సేంద్రియ పద్ధతుల్లో సాగు చేపట్టేందుకు ముందుకు వస్తున్నారు. ఇందుకోసం సలహాలు సంప్రదింపులకు చంద్రశేఖర్‌నే ఆశ్రయిస్తున్నారు.

ఆరోగ్యకర పంటే లక్ష్యం

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు పండించడమే లక్ష్యం. అందుకే పదేళ్లుగా ఎరువుల దుకాణానికే వెళ్లలేదు. భూమి సారం వంతగా ఉండడంతో చెరుకును పది మార్లాములుగా పండిస్తున్నా. అరెకరాలో 21 రకాల పంటలు సాగు చేస్తున్నా. ఎర్రబెండ గుండె జబ్బులు, షుగర్ వ్యాధిగ్రస్తులకు చాలా మంచిది. ఉత్తరభారతంలో అయితే కిలో రూ.800 పలికిన సందర్భాలున్నాయి. ప్రస్తుతం మిట్టపాళెం, నింద్రలో రైతులు ఎర్రబెండ సాగుచేస్తున్నారు. **– చంద్రశేఖర్, రైతు, కృష్ణరామాపురం**

లీజుకు ఆర్టీసీ స్థలాలు

● తిరుపతి జిల్లా ఆర్ఎం చెంగల్‌రెడ్డి



వ్యాపారులతో చర్చిస్తున్న ఆర్ఎం చెంగల్‌రెడ్డి



లీజుకు ఇచ్చే స్థలాలను పరిశీలిస్తున్న ఆర్ఎం చెంగల్‌రెడ్డి, ఇతర అధికారులు

పుత్తూరు రూరల్: పుత్తూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని 2617 చదరపు గజాల స్థలంతో పాటు 4,162 చ.గ., 5,179 చ.గ. వేరువేరు స్థలాలను 15 ఏళ్ల పాటు లీజుకు పొందడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి జిల్లా రవాణాధికారి టి.చెంగల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డీఎం కార్యాలయంలో రిలయన్స్ సంస్థ సభ్యులు, ఇతర వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టెండర్ డాక్యుమెంట్ ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.5 వేలు, జీఎస్టీతో చెల్లించి, apsrtc.a p.gov.in వెబ్‌సైట్ ద్వారా టెండర్ ఫారాలను పొందవచ్చునని తెలిపారు. టెండర్లను కడపలోని ఈడీ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. కడపలో నిర్వహించే బహిరంగ వేలం తేదీని తర్వాత ప్రకటిస్తామన్నారు. వివరాలకు 7331106731, 9959268390 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని ఆశావహులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, డిపో మేనేజర్ ప్రశాంతి పాల్గొన్నారు.

చెప్పకుండా ఎద్దును అమ్మేశారన్న బాధతో..



పురుగు మందు తాగుతున్న సుబ్రమణ్యం

శాంతిపురం: తనకూ భాగస్వామ్యం ఉన్న ఎద్దును బంధువులు తెలియకుండా అమ్మేశారనే ఆవేదనతో ఓ యువకుడు విషం తాగిన సంఘటన మంగళవారం వెలుగుచూసింది. వివరాలు.. మఠం పంచాయతీలోని సంతూరు గ్రామానికి చెందిన మునెప్ప కుమారుడు సుబ్రమణ్యం(25) కెంపసముద్రంలోని తన బంధువుతో కలిసి నాలుగేళ్ల క్రితం ఓ కుర్రను కొనుగోలు చేశాడు. ఇటీవల ఎడ్ల పరుగు పందేల్లో ఆ ఎద్దు వరుసగా బహుమతులు గెలుస్తోంది. ఈ నేపథ్యంలో సుబ్రమణ్యంకు తెలియకుండానే ఆ ఎద్దును రామకుప్పం మండలంలోని కెంపసముద్రం గ్రామానికి చెందిన అతని బంధువులు రూ.18.60 లక్షలకు అమ్ముకున్నారు. దీంతో సుబ్రమణ్యం మంగళవారం గ్రామ సమీపంలో పురుగుల మందు తాగుతూ పోలీసులు తనకు న్యాయం చేయలేదని, ఓ సెల్ఫీ వీడియో రికార్డు చేసి మిత్రుడికి వాట్సాప్ ద్వారా పంపాడు. గమనించిన మిత్రులు, కుటుంబ సభ్యులు వెతికి అపస్మారక స్థితిలో ఉన్న సుబ్రమణ్యంను కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఆత్మహత్యా యత్నం వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చర్చనీయాంశమైంది.

మహిళలకు క్రీడల్లో మరింత ప్రోత్సాహం



జ్యోతి ప్రజ్వలనలో ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

తిరుపతి రూరల్ : మహిళా ఉద్యోగులకు క్రీడల్లో సైతం మరింత ప్రోత్సాహం అందించనున్నట్లు ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు తెలిపారు. ఏపీ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఇంటర్ సర్కిల్ ఉమెన్ గేమ్స్, కల్చరల్ పోటీలను మంగళవారం తిరుపతిలో ప్రారంభించారు. ఎస్పీడీసీఎల్ ఇండోర్ ఆడిటోరియంలో ప్రారంభోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఎండీ మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తారని కొనియాడారు. మహిళా ఉద్యోగులు వందలాదిగా పోటీల్లో పాల్గొనేందుకు రావడం అభినందనీయమన్నారు. త్వరలోనే రాష్ట్రస్థాయి పోటీలను శ్రీవారి చెంత నిర్వహించనున్నట్లు తిరుపతి సర్కిల్ స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తెలిపారు. మధ్యాహ్నం తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల మైదానంలో క్రీడలు, సాయంత్రం కార్పొరేట్ కార్యాలయ ఆడిటోరియంలో సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫైనాన్స్, ప్రాజెక్ట్స్ డైరెక్టర్లు వీఎన్‌బాబు, శివప్రసాద్ రెడ్డి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ లావణ్యలక్ష్మి, సీజీఎంలు ధర్మజ్ఞాని, వరకుమార్, చలపతి, గురవయ్య, విజయ్‌కుమార్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ రాధాజయశ్రీ, స్పోర్ట్స్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ వాసుదేవరెడ్డి, పురుషోత్తం, లీలారామ్, జయచంద్ర, వడివేలు పాల్గొన్నారు.

హోరాహోరీగా 'ఎస్పీఎల్'

● రీజనల్ స్థాయిలో తలపడిన అనంత, వైఎస్సార్, తిరుపతి, కర్నూలు, నంద్యాల జట్లు
● సీనియర్ విభాగంలో ఫైనల్‌కు చేరిన తిరుపతి, కడప జట్లు



టాస్ వేసి అనంతపురం-తిరుపతి జట్ల మధ్య మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న 'సాక్షి' అనంతపురం బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్

అనంతపురం సప్తగిరి సర్కిల్: 'సాక్షి' మీడియా గ్రూపు ఆధ్వర్యంలో 'సాక్షి ప్రీమియర్ లీగ్' (ఎస్పీఎల్) రీజనల్ స్థాయి క్రికెట్ పోటీలు తొలి రోజు హోరాహోరీగా సాగాయి. అనంతపురం జిల్లాతో పాటు వైఎస్సార్, తిరుపతి, కర్నూలు, నంద్యాల జట్లు రీజనల్ స్థాయి పోటీలకు అర్హత సాధించగా, అనంత క్రీడాగ్రామం వేదికగా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి.

SAKSHI MEDIA GROUP

సీనియర్ విభాగంలో సీకాం డిగ్రీ కళాశాల (తిరుపతి), ఆర్ట్స్ కళాశాల (అనంతపురం) జట్లు మధ్య జరిగిన తొలి మ్యాచ్‌ను 'సాక్షి' అనంతపురం బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్ టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్తమాన క్రీడాకారులకు ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, క్రీడలతో మానసిక, శారీరక వికాసంతో పాటు ప్రతిభ చూపితే ప్రభుత్వ ఉద్యోగాలు సులువుగా దక్కించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో 'సాక్షి' ఏడీవీటీ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు, ఈవెంట్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాచ్‌ల వివరాలు ఇలా..

అనంత క్రీడాగ్రామంలోని హాకీ క్రీడామైదానం వేదికగా జరిగిన సీనియర్ విభాగం తొలి మ్యాచ్‌లో సీకాం డిగ్రీ కళాశాల (తిరుపతి), ఆర్ట్స్ కళాశాల అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి ఆర్ట్స్ కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన తిరుపతి జట్టు నిర్ణీత పది ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 110 పరుగులు సాధించింది. జట్టులో లేఖజ్ 18 బంతుల్లో 37 పరుగులతో అజేయంగా నిలవగా, మరో బ్యాట్స్‌మెన్ శశాంక్ 29 పరుగులు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన అనంతపురం జట్టు నిర్ణీత పది ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 84 పరుగులు మాత్రమే చేసింది. 26 పరుగుల తేడాతో తిరుపతి జట్టు విజయం సాధించింది. అలాగే సీనియర్ విభాగంలో జరిగిన రెండో మ్యాచ్‌లో వైఎస్సార్ కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల, కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన పొద్దుటూరు జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 79 పరుగులు చేసింది. జట్టులో వెంకటేష్ 20 బంతుల్లో 30 పరుగులు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 75 పరుగులకే పరిమితమైంది. జావీద్ 31 బంతుల్లో 51 పరుగులతో అజేయంగా నిలిచాడు. అయితే 4 పరుగుల తేడాతో పొద్దుటూరు జట్టు విజయం సాధించింది.

SAKSHI PREMIER LEAGUE

చెలరేగిన తిరుపతి ఆటగాళ్లు

జూనియర్ విభాగంలో అనంతపురం జిల్లా నుంచి ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల జట్టుతో పాటు వైఎస్సార్ జిల్లా కడపలోని శ్రీసాయి ఐటీఐ కళాశాల, తిరుపతిలోని సీకాం జూనియర్ కళాశాల, నంద్యాల ఈఎస్‌సీ పాలిటెక్నిక్ కళాశాల జట్లు రీజనల్‌స్థాయి పోటీలకు అర్హత సాధించాయి. తొలి మ్యాచ్ సీకాం జూనియర్ కళాశాల (తిరుపతి), ఈఎస్‌సీ పాలిటెక్నిక్ కళాశాల (నంద్యాల)జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన నంద్యాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 61 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన తిరుపతి జట్టు కేవలం 5.4 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి ఫైనల్‌కు చేరింది.

నేడు పోటీ పడే జట్లు..

సీనియర్ విభాగంలో ఫైనల్ మ్యాచ్ సీకాం డిగ్రీ కళాశాల (తిరుపతి), ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల (పొద్దుటూరు) జట్ల మధ్య బుధవారం ఉదయం 11 గంటలకు జరుగుతుంది. అలాగే ఉదయం 9 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల-ఆత్మకూరు (అనంతపురం), శ్రీసాయి ఐటీఐ కళాశాల-కడప (వైఎస్సార్) జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో గెలుపొందిన జట్టుతో తిరుపతి సీకాం జట్టు తలపడనుంది.



ఫైనల్‌కు చేరిన తిరుపతి సీకాం డిగ్రీ కళాశాల జట్టు



జూనియర్ విభాగంలో ఫైనల్‌కు చేరిన తిరుపతి సీకాం జూనియర్ కళాశాల జట్టు

తమిళనాడు బియ్యం పట్టివేత



కుప్పం: తమిళనాడు నుంచి కుప్పం మీదుగా కర్ణాటక రాష్ట్రం బంగారుపేటకు అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. మంగళవారం బొలేరో లగేజీ వాహనంలో 25 బస్తాలు తమిళనాడు రేషన్ బియ్యాన్ని కర్ణాటకకు తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు వాహనాల తనిఖీల్లో భాగంగా పట్టుకున్నారు. 25 బస్తాలు తమిళనాడు బియ్యం, వాహనాన్ని రెవెన్యూ శాఖ అధికారులకు అప్పగించారు. వాహనంతో పాటు రేషన్ బియ్యం బస్తాలను సీజ్ చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : ఓపెన్ స్కూల్ విధానంలో పది, ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు అవకాశం కల్పించారని డీఈఓ విజయేంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022–23 విద్యాసంవత్సరానికి గానూ అడ్మిషన్లు చేసుకునేందుకు ఈ నెల 15వ తేదీ వరకు అవకాశం ఉంటుందన్నారు. వివరాలకు సంబంధిత ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సెంటర్లలో సంప్రదించి తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆసక్తి ఉన్న అభ్యర్థులు వినియోగించుకోవాలని డీఈఓ వెల్లడించారు.

576 కర్ణాటక మద్యం ప్యాకెట్ల స్వాధీనం



ఆటో, మద్యం ప్యాకెట్లతో పాటు నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్ఐ రవికుమార్

చౌడేపల్లె: మండలంలోని పరిసర ప్రాంతాలకు కర్ణాటక మద్యాన్ని సరఫరా చేస్తున్న ముఠాను అదుపులోకి తీసుకుని ఆటోతో పాటు ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రవికుమార్ మంగళవారం తెలిపారు. బైరెడ్డిపల్లె మండలం ధర్మపురి పంచాయతీ మేకల నాగిరెడ్డిపల్లెకు చెందిన ఎం.నాగరాజ, చౌడేపల్లె మండలం శెట్టిపేట పంచాయతీ మేకలచిన్నేపల్లెకు చెందిన లత కలిసి కర్ణాటక మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. పక్కా సమాచారం మేరకు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో మద్యం తరలిస్తున్నట్లు గుర్తించామని ఎస్ఐ తెలిపారు. ఆటోతో పాటు 576 కర్ణాటక టెట్రాప్యాకెట్లు మద్యం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరిని కోర్టుకు తరలించగా న్యాయమూర్తి రిమాండుకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. దాడుల్లో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సహకరించండి

● నోడల్ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించండి
● పక్కాగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను అమలు చేయండి
● రాజకీయ పార్టీల నేతలు, నోడల్ అధికారుల సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్



సమావేశంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో రాజకీయపార్టీల నాయకులు, నోడల్ అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎన్నికల సంఘం ఈ నెల 9 షెడ్యూల్ జారీచేసిందన్నారు. అదేరోజు నుంచి జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమల్లో ఉందన్నారు. క్షేత్రస్థాయిలో కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. ఈ నెల 16న ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 23 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, నామినేషన్లను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరిస్తామన్నారు. మార్చి 13న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఎమ్మెల్సీ ఓటింగ్ విధానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ అంశానికి సంబంధించి స్వీప్ యాక్టివిటీస్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, చిత్తూరు ఆర్డీఓ రేణుక, ఎలక్షన్ సూపరింటెండెంట్ పద్మజ, రాజకీయ పార్టీల ప్రతినిధులైన బీజేపీ జిల్లా జనరల్ సెక్రెటరీ చిట్టిబాబు, టీడీపీ స్టేట్ సెక్రెటరీ సురేంద్ర కుమార్, సీపీఐ జిల్లా సెక్రటరీ నాగరాజన్, సీపీఎం జిల్లా సెక్రెటరీ గంగరాజు, కాంగ్రెస్ జిల్లా సెక్రటరీ లోకేష్ బాబు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అశోక్ కుమార్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విధులు సమర్థవంతంగా నిర్వర్తించండి..

ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు నియమించిన నోడల్ అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్ తెలిపారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో ఆయన, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, డీఆర్ఓ ఎన్.రాజశేఖర్‌తో కలిసి నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులను మరింత బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలను పటిష్ఠంగా నిర్వహించేందుకు పకడ్బందీ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. పోలింగ్ స్టేషన్‌లో ఎన్నికల నిబంధనల మేరకు మౌలిక వసతుల కల్పనను పరిశీలించాలని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు మాస్టర్ ట్రైనర్లచే ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ నిర్వహించాలని తెలిపారు. పోలింగ్‌కు అవసరమయ్యే బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. దీంతో పాటు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్‌ల తరలింపు, భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూముల ఏర్పాటు, తదితర అంశాలను అధికారుల సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీఓలు రేణుక శివయ్య, సృజన, డీటీసీ బసిరెడ్డి, హౌసింగ్ పీడీ పద్మనాభం, డీఈఓ విజయేంద్రరావు, డ్వామా పీడీ గంగాభవానీ, ఎల్డీఎం శేషగిరిరావు, సీపీఓ ఉమాదేవి, డీపీఓ లక్ష్మి, ఐసీడీఎస్ పీడీ నాగశైలజ, చిత్తూరు కమిషనర్ అరుణ సంబంధిత శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

36 మంది నోడల్ ఆఫీసర్ల నియామకం

చిత్తూరు కలెక్టరేట్ : గ్రాడ్యుయేట్, టీచర్, స్థానిక సంస్థల ఎన్నికలకు 36 మంది నోడల్ అధికారులను నియమిస్తూ జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్ ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల ప్రకారం నోడల్ ఆఫీసర్ మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్‌కు డీఈఓ విజయేంద్రరావు, సీపీఓ ఉమాదేవి, జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ మురళీకృష్ణ, ఎస్ఐసీ డీఐఓ సుధాకర్, ఎల్‌డీఎం శేషగిరిరావును నియమించారు.

● **ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ :** జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, చిత్తూరు, నగరి, పలమనేరు ఆర్డీఓలు రేణుక, సుజన, శివయ్యను నియమించారు.
● **మెటీరియల్ మేనేజ్‌మెంట్ :** జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి, డీఎస్ఓ శంకరన్, సివిల్ సప్లైస్ డీఎం మోహన్‌బాబు నియమింపబడ్డారు.
● **ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ :** రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ బసిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నరసింహులు
● **కంప్యూటరైజేషన్, సైబర్ సెక్యూరిటీ ఐటీ :** ఎన్ఐసీ జిల్లా ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ సుధాకర్
● **స్వీప్ యాక్టివిటీ :** వయోజన విద్య ఇన్‌చార్జ్ ఏడీ నాగేశ్వరరెడ్డి, ఐసీడీఎస్ పీడీ నాగశైలజ
● **లా అండ్ ఆర్డర్, వీఎం, సెక్యూరిటీ ప్లాన్ :** కలెక్టరేట్ సీ-సెక్షన్ సూపరింటెండెంట్ వాసుదేవన్
● **బ్యాలెట్ బాక్స్ మేనేజ్‌మెంట్ :** జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి
● **మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిర్వహణ :** జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీపీఓ లక్ష్మి, మున్సిపల్ కమిషనర్లు అరుణ, నరసింహప్రసాద్, కిరణ్‌కుమార్, వెంకటరమణారెడ్డి, రవిరెడ్డిని నియమించారు.

వ్యయ నిర్వహణపై మానిటరింగ్..

జిల్లా ఆడిట్ ఆఫీసర్ రంగయ్య, బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్ పేపర్లు- ఎఫ్ఎస్ఓ చంద్రశేఖర్‌నాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పర్వీన్, మీడియా-డీడీ పద్మజ, కమ్యూనికేషన్ ప్లాన్-సివిల్ సప్లైస్ మేనేజర్ మోహన్‌బాబు, ఎలక్టోరల్ రోల్స్-ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పద్మజ, ఓటర్ హెల్ప్‌లైన్‌కు-పశుసంవర్ధక శాఖ జేడీ వెంకట్రావు, మత్స్యశాఖ డీడీ శ్రీనివాసరావు, అబ్జర్వర్స్ నోడల్ ఆఫీసర్‌గా హౌసింగ్ శాఖ పీడీ పద్మనాభంను నియమించారు.

అమ్మవారికి మొక్కు తీర్చుకుని వెళ్తుండగా..

● కారు బోల్తాపడి వ్యక్తి మృతి
● మరో ఇద్దరికి గాయాలు




ధ్వంసమైన కారు ముందుభాగం



ప్రమాదంలో మృతిచెందిన సుబ్రమణ్యం(ఫైల్)

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మను దర్శించుకుని తిరిగి వెళ్తుండగా కారు బోల్తాపడి వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. కర్ణాటక రాష్ట్రంలోని చిక్‌బళాపురం జిల్లా చింతామణి తాలుకా ఐయ్యమరెడ్డిపల్లెకు చెందిన వి.కృష్ణ కోరిక నెరవేరడంతో మంగళవారం బంధుమిత్రులు, కుటుంబీకులతో కలిసి బోయకొండకు అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చారు. దర్శనానంతరం ఆలయం వద్ద నుంచి కిందకు వెళ్తుండగా అటవీ మార్గంలో వారు ప్రయాణిస్తున్న కారు మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో సుబ్రమణ్యం(42), శ్రీనివాసులు(45), డ్రైవర్ సదాశివరెడ్డి (35) గాయపడ్డారు. వీరిలో సుబ్రమణ్యం పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరులోని ఓ ఆస్పత్రికి తరలిస్తుండగా అప్పటికే మృతిచెందినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ప్రకృతి సేద్యానికి ప్రోత్సాహం



రైతులకు ప్రశంసపత్రాలను అందిస్తున్న బీవీ రత్నం

తిరుపతి రూరల్: ప్రకృతి సేద్యానికి ప్రోత్సాహం అవసరమని వర్డ్ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ గంగాధరం కోరారు. తిరుపతిలోని యూత్ హాస్టల్లో మంగళవారం ఏర్పాటు చేసిన తిరుపతి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తిదారుల శిక్షణ సదస్సులో ఆయన మాట్లాడారు. సేంద్రియ పంటలు, ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందించేందుకు ఒక గ్రూపుగా ఏర్పడడం అభినందనీయమన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన రైతులకు ప్రశంసపత్రాలను అందించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ నిపుణులు బీవీ రత్నం, దామా.అయ్యప్పనాయుడు పాల్గొన్నారు.